ఇంటి వంట ముద్దు.. బయటి ఫుడ్ వద్దు

- ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యమివ్వాలి
- జంక్ ఫుడ్‌తో అనర్థాలు అధికం
- కలెక్టర్ పమేలా సత్పతి

వంటల పోటీ విజేతకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మార్చి 20: ఇంట్లో తయారు చేసుకునే ఆరోగ్యకరమైన ఆహారానికి మాత్రమే బాలింతలు, తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బయట లభించే జంక్‌ఫుడ్‌ను తీసుకుంటే ఆనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. పోషణ్ పక్వాడాలో భాగంగా బుధవారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పురుషులకు వంటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, పురుషులు సైతం పాకశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించడం అభినందనీయమన్నారు. మహిళలకు వంటపనిలో సాయం చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు అడుగడుగునా ఏర్పాటయ్యాయని, వాటిలో ఆహారం భుజిస్తే అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. ఇంట్లోనే న్యూట్రిషన్ ఫుడ్ తయారు చేసుకొని భుజించాలని సూచించారు. సాంప్రదాయ వంటకాలపై అధిక దృష్టి సారించాలని, వాటితోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, మహిళలు పోషకాహారం అధికంగా తీసుకోవాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. వంటల పోటీల్లో కొత్తపల్లి సెక్టార్ పరిధిలోని ఆసిఫనగర్-4 అంగన్‌వాడీ సెంటర్‌కు మొదటి బహుమతి లభించింది. సురేశ్-వెన్నెల దంపతులతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, టీచర్ మెంగని పద్మకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి, జిల్లా వైద్యాధికారి డా. సుజాత, డీఈవో జనార్దన్‌రావు, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, సీడీపీవోలు సబిత, లక్ష్మీనారాయణ, కస్తూరి, ఇతర అధికారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిచ్చుకలను సంరక్షించాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 20: కాలానుగుణంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో పిచ్చుకలు రోజురోజుకూ అంతరించి పోతున్నాయని, వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నగరంలోని ఫిలింభవన్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ ఇండ్లల్లోకి వచ్చే పిచ్చుకలను కాపాడాలని సూచించారు. వేసవిలో వాటికి గూడు తయారు చేసి, మంచినీళ్లు అందుబాటులో ఉంచాలన్నారు. పిచ్చుకలకు సేవ చేస్తే దేవుళ్లకు సేవ చేసినట్లేనని పేర్కొన్నారు. పక్షులతోనే మన చుట్టూ ఉన్న వాతావరణం బాగుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రైటర్ కుశ్వంత్ సింగ్ ఘటనను ఉదాహరించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ఇండ్లల్లో పిచ్చుకలను కాపాడుకునేందుకు గూడు ఏర్పాటు చేసి, నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో బాలమణి, డీఈవో జనార్దన్ రావు, జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, సెక్టోరల్ అధికారి అశోక్ రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి, గాజుల రవీందర్, సరిత, కేవీస్ అనంతాచార్య, లక్ష్మణ్, అశోక్ రెడ్డి, జీవశాస్త్ర, ఫిజికల్ సైన్స్ ఫోరం ప్రతినిధులు ఆంజనేయులు, గంగారాం శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి

- నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఉన్నతాధికారులు

ఆస్తి పన్ను చెల్లించిన ఇంటి యజమానికి రసీదు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

కార్పొరేషన్, మార్చి 20: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మరో పది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో మొండి బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని తీసుకురావడంతో ఈ విషయాన్ని ఇంటి యజమానులకు వివరించి పన్ను వసూలు చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భారీగా బకాయిలు పేరుకుపోయిన ఇండ్ల యజమానుల వద్దకు వెళ్లి పన్ను వసూలు విషయంలో కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని సూచిస్తున్నారు. దీంతో ఆయా ఇండ్ల యజమానులు సైతం పన్ను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. బుధవారం నగరంలో ఉన్నతాధికారులు పర్యటించి గురుద్వారా నుంచి రావాల్సిన పన్ను వసూలు చేశారు. గురుద్వారాకు సంబంధించి రూ.7.20 లక్షలు బకాయి ఉండగా, వడ్డీ మాఫీ పోగా రూ.2.89 లక్షలు వసూలు చేశారు. కాగా, నగరవాసులందరూ సకాలంలో పన్నులు చెల్లించాలని అధికారులు కోరుతున్నారు.

ఈసీతో మోదీ ప్రభుత్వం కుమ్మక్కు

కలెక్టరేట్, మార్చి 20: కేంద్ర ఎన్నికల సంఘంతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కైందని దళిత మేధావుల ఫోరం రాష్ట్ర ప్రతినిధి ఉల్లెంగల కనకయ్య ఆరోపించారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రతినిధులు గజ్జెల కనుకరాజు, మార్వాడి మదన్‌మోహన్, రఘుపతి, భూపతికుమార్ పాల్గొన్నారు.

జిల్లా వాసులకు కీర్తి పురస్కారాలు

కమాన్‌చౌరస్తా, మార్చి 20: జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు వివిధ ప్రక్రియల్లో చేసిన కృషికి తెలుగు విశ్వవిద్యాలయం వారు బుధవారం కీర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి, కాలమిస్టు, పత్రిక వ్యాసాల రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, రచయిత, పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కల్వకోట సంతోష్ బాబు, రచయిత, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజుకు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య తంగెడ కిషన్ రావు నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కాగా, పురస్కార గ్రహీతలను ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, సాహిత్య, చరిత్రాభిమానులు అభినందించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, మార్చి 20:జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం రవీంద్రాచారి డిమాండ్ చేశారు. నగరంలోని మంకమ్మతోటలో గల విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం నిర్వహించిన సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు శాతం డీఏ పెంచితే, రాష్ట్ర ప్రభుత్వం మొండి చేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగల సంఘం జిల్లా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కొత్తపల్లి, మార్చి 20: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈనెల 23 నుంచి జరిగే జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి గుర్రం తిరుమలేశ్ ఎంపికైనట్లు పీడీ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. తిరుమలేశ్‌ను కళాశాల కరస్పాండెంట్ ఆగం రావు, ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఎస్ఐ చేరాలుతో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

అప్రమత్తంగా ఉండాలి

తిమ్మాపూర్, మార్చి 20: ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌ను బుధవారం సాయంత్రం సీపీ అభిషేక్ మొహంతి తనిఖీ చేశారు. తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎస్ఐ చేరాలును కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలన్నారు. రౌడీ, హిస్టరీ షీటర్లు, గత ఎన్నికల్లో గొడవలు సృష్టించిన వారిని బైండోవర్ చేయాలన్నారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

కిషన్ (ఫైల్)

రాంనగర్, మార్చి 20: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మార్కొండ కిషన్ (59) బుధవారం స్థానిక జ్యోతినగర్‌లోని నివాస గృహంలో గుండెపోటుతో మృతిచెందారు. 1984 బ్యాచ్‌కి చెందిన కిషన్ 40 సంవత్సరాలు పోలీస్ శాఖలో సేవలందించారు. అతని ఉత్తమ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని ప్రకటించగా, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి చేతుల మీదుగా అందుకున్నారు. కిషన్‌కు భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామం తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో జరుగనున్నాయి.

పురుగులొస్తున్నయి.. పైలం.!


వాహనాలకు అడ్డుగా వస్తున్న పురుగులు

నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్) శివారులో గల కాకతీయ కాలువ వద్ద పురుగులు విజృంభిస్తున్నాయి. కాలువకు ఇరువైపులా హైమాస్ట్ లైట్లు ఉన్నప్పటికీ కాలువ వద్దే మాటు వేసి వాహనదారులను చుట్టుముట్టి ఇబ్బందులు పెడుతున్నాయి. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడిపోయే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి గతంలో మాదిరిగా భారీ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి పురుగులను మళ్లించే ప్రయత్నం చేయాలని వాహనదారులు కోరుతున్నారు. -తిమ్మాపూర్, మార్చి 20

ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేయాలి

కరీంనగర్ రూరల్, మార్చి 20: గ్రామాల్లో ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఎంపీడీవో సంజీవరావు అధికారులను ఆదేశించారు. కరీంనగర్ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, అత్యవసరమైతేనే సెలవులు పెట్టాలని సూచించారు. గ్రామాల్లో అనుమతి లేకుండా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తారని, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏపీవో శోభ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో సంజీవరావు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

చిగురుమామిడి, మార్చి 20: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మధుసూదన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యం, ఈజీఎస్ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాల్లో రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను వెంటవెంటనే డంప్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. ఇన్‌చార్జి ఏపీవో రాజయ్య, కార్యదర్శులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 20: నగరంలో ఈనెల 23న నిర్వహించే భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ పిలుపు నిచ్చారు. నగరంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. నాయకులు హేమంత్, సందీప్, వినయ్‌సాయి, అనిరుద్, అశోక్, శ్రావణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
CHANGE OF NAME
★I, POLASA MOUNIKA, D/o. Polasa Suresh, R/o. H.No. 6-32, Allipur, Raikal, Jagityal, TS. Changed after Marriage My Name as MYALAPU SANJANA, W/o. Myalapu Murali.
NT-328431

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

విశ్వకర్మలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్‌టౌన్, మార్చి 20: విశ్వకర్మ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని టీపీఆర్ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సింగారం ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లో బుధవారం టీపీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు బోరుగల్ల సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి చల్లూరి రఘుచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

వీణవంక, మార్చి 20: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రంజీ ట్రోఫీ ప్లేయర్ నాగేందర్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాలో బుధవారం విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పాఠాలు బోధించి, వాటిలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో పాత శ్రీనివాస్, వీణవంక ఎంపీవో ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి రవూఫ్, కేజీబీవీ ప్రత్యేకాధికారి లావణ్య పాల్గొన్నారు.

హైనా దాడిలో దూడ మృతి

చిగురుమామిడి, మార్చి 20: మండలంలోని నవాబ్ పేట్ గ్రామంలో మర్రి ఐలయ్య పశువుల పాకలో కట్టివేసిన దూడను మంగళవారం రాత్రి హైనా దాడి చేయడంతో మృతి చెందినట్లు బాధితుడు ఐలయ్య తెలిపారు.రోజు వారి లాగే పశువుల పాకలో చూడగా దూడ మృతి చెందినట్లు ఐలయ్య విలపించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. హైనా దాడిలో దూడ మృతిచెందడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

వైభవంగా ఆమలక ఏకాదశి ఉత్సవం

కమాన్‌చౌరస్తా, మార్చి 20: జిల్లా కేంద్రంలోని తిరుమలనగర్‌లో గల శ్రీ నిలయంలో ఆమలక ఏకాదశిని పురస్కరించుకొని ఏకాదశి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచారి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజన చేశారు. పూజల్లో వేదపండితులు రామకృష్ణమాచార్యులు, రమేశ్, శివశంకర్, శైలజ, భక్తులు పాల్గొన్నారు.

షిర్డి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

హుజూరాబాద్‌టౌన్, మార్చి 20: పట్టణంలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం బుధవారం రెండో రోజు కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తగా నిర్మించిన వంటశాల భవనాన్ని దాతల చేతుల మీదుగా ప్రారంభించారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, నాయకులు, శ్రీషిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంట్లో గొడవపడి పారిపోయిన వ్యక్తి

- 2 గంటల వ్యవధిలోనే ఆచూకీ కనిపెట్టిన పోలీసులు

రాంనగర్, మార్చి 20: నగరంలోని పాత బజార్ చెందిన మందపల్లి దేవయ్య బుధవారం ఉదయం 10 గంటల సమయంలో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తన కూతురు రమ కరీంనగర్ వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవి ఆధ్వర్యంలో పోలీసులు అందుబాటులో ఉన్న టెక్నాలజీ సహాయంతో కేవలం రెండు గంటల వ్యవధిలో దేవయ్య పద్మనగర్ శివారులో ఉన్నట్లు కనిపెట్టారు. వెంటనే అక్కడికి చేరుకొని అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి, తన కూతురుకి అప్పగించినట్లు ఇన్స్‌పెక్టర్ సరిలాల్ తెలిపారు. ఎస్ఐ రవి, సిబ్బంది సర్వర్‌ను ఇన్స్‌పెక్టర్ అభినందించారు.

అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మార్చి 20: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు జాతీయ సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. కాగా, బుధవారం వారిని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

కరీంనగర్ డెయిరీలో విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, మార్చి 20: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక కరీంనగర్ డెయిరీని సందర్శించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ అభినందించారు. అధ్యాపకులు డాక్టర్ ఏ నారాయణ, చంద్రమౌళి, ఎం శిరీష, నర్మద, రాములు, రాజు, గౌతమి పాల్గొన్నారు.

23న మంచినీటి సరఫరాలో అంతరాయం

కార్పొరేషన్, మార్చి 20: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 23న మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎండీ వద్ద పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

'రాంబాబు'కు రాష్ట్రస్థాయి పురస్కారం

జమ్మికుంట, మార్చి 20: పట్టణానికి చెందిన విజయగిరి రాంబాబు (కిరణ్ ఫొటో స్టూడియో)కు రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో 'కెమెరా ఐస్' పేరిట హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాంబాబు ద్వితీయ బహుమతి అందుకున్నారు. అటవీ సంపద, పక్షులు, పలు వన్యప్రాణులను తన కెమెరాలో నిక్షిప్తం చేసినందుకు గానూ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా, అవార్డును అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఎంసీ వర్గీస్, కన్జర్వేటర్ శివానీ డోగ్రా, తదితరులు అందజేశారు.

అవార్డు అందుకుంటున్న రాంబాబు

రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్, మార్చి 20: వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని భారత రైతు సమితి జిల్లా నాయకుడు నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు సర్వే చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు.

కొత్తపల్లి, మార్చి 20: వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, నష్టం నివేదికను ప్రభుత్వానికి అందించాలని కోరారు.

తెలంగాణచౌక్, మార్చి 20: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఎకరానికి రూ. 25 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వ్యాన్ చక్రాలు చోరీ

శంకరపట్నం, మార్చి 20: తాడికల్ శివారులో మంగళవారం రాత్రి డీసీఎం వ్యాన్ రెండు చక్రాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఎరడపల్లి గ్రామానికి చెందిన భూతం సంపత్ తాడికల్ ప్రధాన రహదారి పక్కన స్క్రాప్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, మంగళవారం రాత్రి షాప్ పక్కన తన డీసీఎం వాహనం నిలిపి ఉంచగా, గుర్తు తెలియని వక్తులు రెండు చక్రాలను ఎత్తుకెళ్లారు. టైర్లు, చక్రాల విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

హుండీ లెక్కింపు

ఇల్లందకుంట, మార్చి 20: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కించగా రూ.4,04,432 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సుధాకర్ చెప్పారు. జిల్లా దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, ఆలయ సిబ్బంది మోహన్, రాజన్న, నారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చెస్ బోర్డుల పంపిణీ

హౌసింగ్‌బోర్డుకాలనీ, మార్చి 20: స్థానిక గాయత్రీనగర్‌లోని కపిల్ బాలకుటీర్‌లో విద్యార్థులకు హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు చిందం రమేశ్ తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా 6 చెస్ బోర్డులు, పండ్లు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాగర్, సభ్యులు పాల్గొన్నారు.

'చేయూత'కు జాతీయ స్థాయి అవార్డు

జమ్మికుంట, మార్చి 20: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మక్స్ గ్లోబల్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి జరిగిన నేషనల్ అవార్డు సెలబ్రేషన్స్-2024లో పట్టణానికి చెందిన చేయూత ఫౌండేషన్‌కు జాతీయ స్థాయి అవార్డు దక్కింది. కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు ఈ అవార్డు వచ్చింది. చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దూడపాక శ్రీనివాస్‌కు ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవా పురస్కారం, సభ్యులు అబేద భాను, శిరీషకు రాణి రుద్రమదేవి సేవా పురస్కారాలు ప్రదానం చేశారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

సైదాపూర్, మార్చి 20: ఎక్లాస్‌పూర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ ధర్మకర్తలు వేముగంటి మురళీమనోహర్‌రావు, వేముగంటి జగదీశ్‌చందర్‌రావు, అర్చకులు చక్రపాణి వెంకటాచార్యులు, నరహరిచార్యులు, శ్రీనివాసాచార్యులు, రవీంద్రాచార్యులు తెలిపారు. పూజల్లో సింగిల్‌విండో చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, భక్తులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌టౌన్, మార్చి 20: పట్టణంలోని ఇందిరానగర్ సమీపంలో గల ఎస్సారెస్పీ ప్రధాన కాలువ బ్రిడ్జిపై తుమ్మనపల్లికి చెందిన దక్షిణమూర్తి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ తన వాహనం ఆపి, క్షతగాత్రున్ని ఆటోలో దవాఖానకు పంపించారు. వైద్యులకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కాగా, మురుగు కాలువ నీరు ప్రధాన రహదారిపై నుంచి పారడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రిటైర్డ్ ఏఈ మృతికి వాకర్స్ సభ్యుల సంతాపం

హుజూరాబాద్ టౌన్, మార్చి 20: రిటైర్డ్ ఏఈ మునిగంటి వెంకటేశ్వర్లు మృతికి హుజూరాబాద్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంతాప సభ నిర్వహించారు. స్థానిక హైస్కూల్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, వాకర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ముక్క రమేశ్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ సలీం, వాకర్ అసోసియేషన్ నాయకులు శిల్పి శ్రీనివాస్, సతీశ్, వెంకటరాజం, ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

కమిషనరేట్ వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

రాంనగర్, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు సీపీ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి కరీంనగర్‌లోని హోటళ్లు, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. అక్రమ డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ చేసే వారిని కట్టడి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఈ దాడులు కొనసాగుతాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.